క్లుప్తంగా

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో మత్తు రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డీఎస్పీని కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ పాల్గొని విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉపేంద్రను సన్మానిస్తున్న సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సేగు ఉపేంద్ర తెలిపారు. నంద్యాల జిల్లా పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా సేగు ఉపేంద్రను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్యులపై దాడులను ఎదుర్కోవడానికి తన వంతు పోరాటం చేస్తానన్నారు. సమితి వ్యవస్థాపకుడు గుడివాడ వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సముద్రాల పాండురంగయ్య, సుధాకర్ భద్రశెట్టి రవి, అమరేశ్, సురేష్, సుధాకర్, భారతకుమార్, శివనంద కిరణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వే



ముత్యాలపాడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: ఎన్‌సీడీ సర్వేలో భాగంగా మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం ఇంటింటికీ వెళ్లి కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన వారికి రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ రక్త పరీక్షలను నిర్వహించారు. ముత్యాలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి తస్లీమా సుల్తానా మాట్లాడుతూ గ్రామంలో 1204 కుటుంబాలకు పరీక్షలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 344 కుటుంబాలను పరీక్షించామని చెప్పారు.ఏఎన్‌ఎం పి.సుభాషిని, సి.లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం.. తిరుచ్చి ఉత్సవం



స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, ఆలయ అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

నేడు కాశీనాయన ఆరాధనోత్సవం

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్లలో వెలసిన కాశీనాయన ఆశ్రమంలో శనివారం 29వ ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని అభిషేకం, స్వామివారి గ్రామోత్సవం, జ్యోతిప్రజ్వలన, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సారా కేసులో ఇద్దరికి రిమాండ్

అవుకు: నాటుసారా తయారీ కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో దాడులు నిర్వహించగా తిమ్మనాయునిపేటకు చెందిన దూదేకుల బాల హుసేని వద్ద 10 లీటర్ల నాటు సారా, రామాపురం గ్రామానికి చెందిన సాత్రి బాల నాగమ్మ వద్ద 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

రాజీకి రాజమార్గం

- సత్ఫలితాలు ఇస్తున్న జాతీయ లోక్ అదాలత్
- రాజీతో ఇరువర్గాల గెలుపు
- రెండేళ్లలో 17,750 కేసులు పరిష్కారం
- నేడు జిల్లాలోని కోర్టుల్లో కార్యక్రమం

నంద్యాల(వ్యవసాయం): చిరకాలంగా కోర్టుల్లో అపరిష్కృతంగా నిలిచిపోయిన కేసులను రాజీ మార్గంలో పరిష్కారం చూపుతోంది లోక్ అదాలత్. తక్కువ వ్యవధిలో ఖర్చు లేకుండా లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చు. ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. పాత కేసుల్లో చెల్లించిన ఫీజులను వాపస్ ఇస్తారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరు పక్షాలు తమ కేసును లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించమని కోరినప్పుడు గాని, లేదా ఏ ఒక్క పార్టీ కోరినప్పుడు గాని సదరు కేసు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించదగినదని ఆ కోర్టులు భావించినప్పుడు తదితర లోక్ అదాలత్‌లకు ఆ కోర్టులు పంపవచ్చు. ఒక వేళ కోర్టు వరకు కేసు వెళ్లని పక్షంలో ఇద్దరు పార్టీల వారు తమ తగాదాను పరిష్కరించాల్సిందిగా సంబంధిత జిల్లా, తాలూకా, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్జీలు పెట్టి పరిష్కరించుకోవచ్చు. జిల్లాలోని కోర్టుల్లో ఈనెల 14వ తేదీన లోక్ అదాలత్ నిర్వహించనున్నారు.

జిల్లాలో ఇలా..

నంద్యాల జిల్లాలో డోన్, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల్లో కోర్టు ఆవరణల్లో లోక్‌అదాలత్‌లు వారానికి గాని, మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ కార్యక్రమాలు జరుగుతాయి. కక్షి దారులు ఆయా కోర్టుల పరిధిలో త్వరితగతిన పరిష్కరించడం కోసం లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే అప్పీలు లేని అంతిమ తీర్పు వెలువడుతుంది.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి వాసు (ఫైల్)

ఎలా సంప్రదించాలి..

పెండింగ్ కేసులున్న కక్షిదారులు రాజీ కుదుర్చుకునేందుకు ఆయా కోర్టు పరిధిలో సీనియర్ సివిల్ జడ్జి బెంచ్ వద్ద, మండల లీగల్ సెల్ కార్యాలయం, పారాలీగల్ న్యాయవాది ద్వారా సంప్రదించి కేసుల పరిష్కారించుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు, ఆర్థికంగా వెనుకబడిన వారికి, మహిళలకు ఉచితంగా న్యాయ సేవలందిస్తారు.

ఏ కేసులు పరిష్కరించుకోవచ్చు..

బీఎన్‌ఎస్‌ఎస్ ప్రకారం 359 చట్టం కింద రాజీ పడే కేసులు 362, 373, 374, 381, 382, 383, 385, 391, 444, 447, 451, 454, 457 ఈ సెక్షన్లు కింద ఉన్న కేసులు మాత్రమే రాజీ పడే అవకాశం ఉంది. ఎక్కువగా గృహ హింస, ప్రోనోటు, మోటారు వెహికల్, మెయింటనెన్స్, చీటింగ్, ట్రాఫిక్ రిలేటెడ్, ఫ్యామిలీ రిలేటెడ్, పెట్టీ కేసులు, డ్రంకెన్‌డ్రైవ్, ఇన్సూరెన్స్, బ్యాంకులు, మున్సిపల్, బీఎస్‌ఎన్‌ఎల్, సెబ్, తదితర కేసులు పరిష్కారమవుతాయి.

పెరుగుతున్న ఆదరణ..

లోక్ అదాలత్‌లకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుంది. కేసులు పరిష్కారమైతే మళ్లీ అప్పీలుకు పోవాల్సిన అవసరం ఉండకపోవడం కక్షిదారులకు అనుకూలంగా మారనుంది. అలాగే కోర్టు ఫీజులు వాపస్ ఇస్తూ లోక్ అదాలత్ లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ప్రకారం తీర్పును సివిల్ కోర్టులు అవార్డు ఇస్తాయి. స్నేహ పూరిత వాతావరణంలో తగాదాలకు తావు లేకుండా పరిష్కారమవుతుండటంతో కక్షిదారులు పరిష్కారానికి ముందుకొస్తున్నారు.

ఈ ఏడాది సెప్టెంబర్ 14న జిల్లాలో పరిష్కారమైన కేసుల వివరాలు..

నంద్యాల	- 1097
డోన్	- 123
కోవెలకుంట్ల	- 131
ఆత్మకూరు	- 165
నందికొట్కూరు	- 230
బనగానపల్లె	- 73
ఆళ్లగడ్డ	- 84

జూన్ 2022-23 మార్చిలో 7,500 కేసులు
జూన్ 2023-24 మార్చిలో 10,250 కేసులు

సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి. కక్షిదారులు రాజీమార్గాన్ని ఎన్నుకునే విధంగా అవగాహన కల్పిస్తాం. లోక్ అదాలత్‌లో వచ్చిన తీర్పు అంతిమం. వీటికి ఎటువంటి రుసుము లేదు. పెండింగ్ కేసులు అయిన కానీ, నేరుగా ఇరువర్గాలు వచ్చినా వారికి సత్వర న్యాయం కల్పిస్తూ త్వరితగతిన కేసులను పరిష్కరిస్తాం.

–వాసు, మండల లీగల్‌సెల్ చైర్మన్, నంద్యాల

రాజీ వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తాం



ఇరువర్గాల మేలు కోసం రాజీ కుదిర్చేందుకు కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కేసుల పరిష్కారానికి శనివారం జాతీయ మెగాలోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశారు. రాజీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి అందుకు అంగీకారానికి వస్తే ఆ కేసుల వివరాలను లోక్ అదాలత్ దృష్టికి తీసుకెళ్తాం. సివిల్ సమస్యలపై పోలీసు స్టేషన్లకు వచ్చే వారిని లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని చెబుతున్నాం. ఇరువురి రాజీ మేరకు మాత్రమే రాజీ కుదురుతుంది. లేదంటే కేసు కొనసాగుతుంది.

– అదిరాజ్‌సింగ్ రాణా, ఎస్పీ, నంద్యాల

న్యాయవాదుల పాత్రే కీలకం



ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసుల కక్షిదారులను రాజీమార్గానికి న్యాయవాదుల సహకారంతో మధ్య వ్యక్తిగా ప్రయత్నం చేస్తాం. వ్యాజ్యానికి ముందు దశలో ఉన్న ఏదైనా వివాదాన్ని పరిష్కరించటానికి కృషి చేస్తాం. వివాదాల్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవటానికి అవకాశం ఉన్నటువంటి కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మోటారు వెహికల్ కేసులు, ప్రోనోట్ కేసులు, బీమా కేసులు, గృహహింస కేసులపై ఎక్కువగా రాజీ ప్రయత్నానికి కృషి చేస్తుంటాం. – రావినూతల దుర్గాప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, నంద్యాల

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



తహసీల్దార్ శ్రీనివాసులు

ఉయ్యాలవాడ : సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. డబ్ల్యూఏ సంఘాలకు (టీసీ)లు 9 గంటలలోగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. మండల పరిధిలో 9 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. డబ్ల్యూఏ సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే అదే రోజు చైర్మన్, వైస్ చైర్మన్‌లను కూడా ఎన్నుకుంటారన్నారు. ఎన్నికల నిర్వహణ నిమిత్తం నోడల్ అధికారిగా ప్రసాద్‌రెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు.

నేడు నామినేషన్లు

దొర్నిపాడు: సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా మండలంలోని కొండాపురం టీసీకి సంబంధిచి భాగ్యనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే కొత్తపల్లె టీసీ సింబంధించి డబ్ల్యూ గోవిందిన్నెలోని సచివాలయంలో నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ఎన్నికల అధికారి సుప్రియ తెలిపారు.

ఓటర్ల వివరాలు..

గ్రామం	నీటి సంఘం	డబ్ల్యూఏ సంఖ్య	ఓటర్లు
రూపనగుడి	చెరువు	6	191
తుడుమలదిన్నె	చెరువు	6	67
హరివరం	కేసీ కాలువ	12	749
ఉయ్యాలవాడ	కేసీ కాలువ	12	606
పెద్దయమ్మనూరు	కేసీ కాలువ	12	879
పెద్దయమ్మనూరు	కేసీ కాలువ	12	792
మాయలూరు	ఎస్సార్బీసీ	12	501
అల్లూరు	ఎస్సార్బీసీ	12	327
మాయలూరు	ఎస్సార్బీసీ	12	829

వేతనాలు మంజూరు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు, ఆయాలకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్నా ఐదు నెలల జీతాలు ఇంత వరకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈనెల 16వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నవంబర్ 22వ తేదీన డబ్బులు వచ్చాయని, మీ అకౌంట్లలో వేస్తామని చెప్పి ఇంత వరకు ఒక్కరూపాయి కూడా వేయలేదన్నారు.

ఆళ్లగడ్డ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కిశోర్

కడప కార్పొరేషన్: కడప కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.కిశోర్‌ను ఆళ్లగడ్డ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఆళ్లగడ్డ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండటంతో సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చాగలమర్రి: మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలోని 44వ నెంబరు జాతీయ రహదారిపై కర్నూలు నుంచి చాగలమర్రికి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. వారిలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. వివరాలు..చాగలమర్రికి చెందిన సప్లయర్స్ యజమాని రమణ కారులో తన కుమారుడు చంద్రకాంత్, భార్య క్రిష్ణవేణితో కలిసి కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తుంగా మద్దూరు మెట్ట సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రకాంత్‌కు స్వల్ప గాయాలు కాగా, క్రిష్ణవేణికి తీవ్ర గాయాలవ్వడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జమిలితో రాష్ట్రాల హక్కులకు భంగం

నంద్యాల(అర్బన్): జమిలి ఎన్నికల అసలు లక్ష్యం రాష్ట్రాల హక్కులను హరించడమేనని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాలకు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి ఉందని, ఒకేసారి ఎన్నికలు జరిగి కేంద్రంలో వచ్చిన పార్టీకి వ్యతిరేకంగా ఏర్పాటయ్యే రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయిస్తే మళ్లీ ఎన్నికలు వచ్చేంత వరకు గవర్నర్ పాలన కొనసాగే అవకాశముందన్నారు.

15న పొట్టి శ్రీరాములు వర్ధంతి

నంద్యాల(అర్బన్): ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఈనెల 15వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించే వర్ధంతి కార్యక్రమానికి ఎంపీపీ శెట్టి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పీఎస్‌లు, ఏపీఓ, ఎంఈఓ తదితరులు పాల్గొనాలని కోరారు.

స్వర్ణకారుల అభివృద్ధికి కృషి

చాగలమర్రి: స్వర్ణకారుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తానని రాష్ట్ర స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ హామీ ఇచ్చారు. మండల సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన డి.గౌస్‌బాషా ప్రమాణ స్వీకారానికి, స్థానిక స్వర్ణకారుల సంఘం కార్యాలయ ప్రారంభోత్సవానికి రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్‌ను శుక్రవారం విజయవాడలో ఆయన స్వగృహంలో ఆహ్వానించారు. అనంతరం ఆయన నూతనంగా ఎంపికైన మండల అధ్యక్షుడు గౌస్‌బాషా అభినందించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.దాదాపీర్, అధికార ప్రతినిధి కె.అబ్దుల్లా, సహాయ కార్యదర్శి ఆర్ బావద్దీన్ ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న సర్వేయర్ శివకుమార్

నంద్యాల(అర్బన్): భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని, మండల గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రియదర్శిని కోరారు. శుక్రవారం మండలంలోని గుంతనాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించిన సమస్యలను ఇక్కడికక్కడే పరిష్కరిస్తామని చెప్పారు. మండల సర్వేయర్ శివకుమార్ మాట్లాడుతూ భూముల కొలతల్లో తేడాలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు,. సదస్సుకు 5 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు ఉన్నారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 29 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలలో మంజూరులో జాప్యం జరుగుతుందని, కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని, భూ విస్తీర్ణంలో తేడాలున్నాయి, కొలతలు సరి చేయాలని మరికొందరు రైతులు గ్రామసభలో తహసీల్దార్‌కు అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. గ్రామంలో రీ సర్వే నిర్వహించవలసి ఉంది. 458 మంది రైతులకు సంబంధించి 1,600 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేయాల్సి ఉంది.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ఆర్వీవీఎస్ మురళీకృష్ణ

ఆళ్లగడ్డ: ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు ఆర్వీవీఎస్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు, అన్న విషయాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కేసులను వాదించెందుకు మీకు న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, సూచనలు కావాలంటే ప్రతి మంగళ, శుక్రవారాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా అందిస్తామని చెప్పారు. ఆన్‌లైన్ ద్వార న్యాయ సేవల గురించి తెలుసుకోవాలంటే 15100 కి కాల్ చేయాలన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయం



ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఆళ్లగడ్డ: సాక్షి విలేకరులపై దాడి చేసిన కూటమి నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా వేములలో శుక్రవారం నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన సాక్షి జర్నలిస్టులు శ్రీనివాస్, రాము, రాజారెడ్డిపై కూటమి నేతలు మూకుమ్మడిగా రాళ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచారు. ఇందుకు ఆళ్లగడ్డ విలేకరుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం నిందితులపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ చిరంజీవికి ఫిర్యాదు చేశారు. సీనియర్ పాత్రికేయులు నాగరాజు, శ్రీనివాసులు, నిజాం, ఇస్మాయిల్, ఉశేన్‌బాషా తదితరులు ఉన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



అధికారులు, సర్పంచ్‌లతో ఎంపీడీఓ సుగుణశ్రీ



చాగలమర్రిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

నంద్యాల(అర్బన్): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని కేరళ, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు మాత్రమే గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ముందంజలో ఉన్నాయన్నారు. చాపిరేవుల గ్రామ పీహెచ్‌సీ వైద్యురాలు ఉదయ సంధ్యా, ఎంఈఓ బ్రహ్మం నాయక్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధిపై జరుగుతున్న శిక్షణ తరగతరులు శుక్రవారం ముగిశాయి. ఈఓపీఆర్‌డీ పాల్గొని గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులతో కలిసి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండవ రోజు కూడా శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు ఒక్కరు మినహా మిగతా 19 మంది హాజరు కాలేదు. ఉయ్యాలవాడ గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు మాత్రమే హాజరయ్యారు. శిక్షణ ఇవ్వవలసిన ఏపీఎం దాస్ హాజరవకుండా సీసీ గంగన్నతో శిక్షణ ఇప్పించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణకు హాజరు కాకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు.

చాగలమర్రి: స్థానిక ఎంపీపీ సమావేశ భవనంలో ఎల్‌ఎస్‌డీజీఎస్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్‌లు హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుద్రవరం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు చేపట్టిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ప్రధానంగా గ్రామాల అభివృద్ధికి ఉద్యోగులు, సర్పంచులు సమష్టిగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సూచించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించడంతో పాటు స్థానికంగా వనరులు సమకూర్చుకునేందుకు కూడా కృషి చేయాలని సూచించారు.

దొర్నిపాడు:స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, అధికారులకు జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఎంపీడీఓ సావిత్రి, ఎంఈఓ మనోహర్‌రెడ్డి సర్పంచులు విధులు, హక్కుల గురించి వివరించారు. ఈఓపీఆర్డీ సేలోచన, ఏఓ నారాయణమూర్తి ఆర్‌డబ్ల్యూఎస్‌ఏఈ సుప్రియ, హౌసింగ్ ఏఈ బ్రహ్మం, ఏపీఎం బాబు పాల్గొన్నారు.



నృత్యప్రదర్శనలో కళాకారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై శుక్రవారం కర్నూలుకు చెందిన సాయిలలిత కళాక్షేత్రం వారి కూచిపూడి నృత్యప్రదర్శన ప్రదర్శించారు. మహాగణపతిం, శివాష్టకం, మూషికవాహన, మహిషాసురమర్దిని, శివతాండవం, శంభో శివ శంభో, ఓం నమఃశివాయ తదితర గీతాలకు, అష్టకాలకు పూజిత, సుదీక్ష, గీతాన్విత, మోక్షశ్రీ, మనుశ్రీ, ప్రణవి, శ్రీవిద్య, హర్షశ్రీ, సత్యకీర్తన, ఇందు, మనస్విని, రాజతరుణి, జ్యోతిక నృత్యాలు ప్రదర్శించారు.

ఎట్టకేలకు సీసీరోడ్డు పనులు ప్రారంభం



ఎస్సీ కాలనీలో మొదలైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని ఎస్సీకాలనీలో సీసీరోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 12న »తెగని వివాదం..ఆగిన సీసీరోడ్డు నిర్మాణం« అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు పొలం రైతు, కాలనీవాసులతో చర్చించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉజ్మా, కాంట్రాక్టర్ పవన్‌నరసింహ, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.